# చివరి మలుపు

ఉమా శివానంద రెడ్డి

బాబూ! మధుసూదనం!

మమకారమనేది బాంధవ్యాలకన్నా, స్నేహాలకన్నా అతీతమైనది. దాన్ని పెకలించే సాహసం వ్యక్తికిగానీ సంఘానికి గానీ లేదు. అలాంటి మమకారం నీకు గౌరికి మధ్య పెంపొందింది. దాని ఫలితమేమిటో తెలిసికూడా, నేను చూస్తూ ఊరుకున్నాను. నా చిట్టితల్లి అభిమతానికి అడ్డురావడం నా కిష్టం లేదని నీకు తెలుసు. గౌరి వయసులో చిన్నదైనా ఆలోచనలో ఏ పెద్దలకు తీసిపోదు. అందుకే నాకు గౌరిమీద అంత నమ్మకం. ఏ పని చేసినా ముందుగానే ఆలోచించి చేస్తుందని నా ఉద్దేశ్యం.

బాబూ! ఇప్పటికే వ్యర్థప్రసంగంచేసి నిన్ను విసిగెత్తించాను. అసలు విషయం రాస్తాను. నీవు పోయిన రెండురోజులు గౌరి నిన్ను అడిగింది. ఊరికి పోయావని మళ్ళీ వస్తావని సర్ది చెప్పాను. కానీ బాగా ఏడ్చి ఏడ్చి నిద్రపోయేది. కానీ మూడు రోజుల నుంచీ జ్వరం రావడం మొదలుపెట్టింది. ఏదో మామూలు జ్వరమని నిర్లక్ష్యంగా ఉన్నాను. కానీ నిన్నటి నుండి జ్వరం తీవ్రత ఎక్కువైంది. కలవరింపులు కూడా వస్తున్నాయి. నిన్ను ఎక్కువగా కలవరిస్తున్నది. ధైర్యం చాలక నీకు వ్రాస్తున్నాను. నీకు తీరిక ఉంటే ఒక్కసారి ఈ ముసలివాని కోరికను మన్నించి వస్తావా బాబూ! నా జీవన జ్యోతి నా ఇంటిలో మళ్ళా వెలిగేటట్లు చేయి బాబూ.

ఇట్లు,
దీవనలతో సుబ్బయ్య."

ఉత్తరాన్ని మడిచి జేబులో పెట్టుకున్నాడు మధు. అసలు ఏమిటి అంతటి సాహసం గల బాంధవ్యం. ఏమీలేదు. పున్నమి చంద్రుని కాంతి రేఖలు సముద్రపుటలల మీద పడి ఎంత ఆహ్లాదాన్ని కల్గిస్తున్నాయి. అవి బాంధవ్య రేఖలా? ఛ, ఛ, కాదు. అవి మమకారరేఖలు. బాంధవ్యరేఖలు: మిట్టమధ్యాహ్నపు రేఖలు, సృష్టిలో కొన్నివస్తువులు, కొన్ని వస్తువులను మాత్రమే ప్రత్యేకంగా ఆకర్షిస్తాయి. మిగిలిన వాటిని ఎందుకు ఆకర్షించవు. "అదే సృష్టి బంధం, మమకారబంధం" అని గొణుక్కున్నాడు మధు.

* * *

కారు పల్లెలో ప్రవేశించింది. గతుకుల రోడ్డులో నెమ్మదిగా పోయి, పెద్ద సావిడి ముందు నిలిచింది. కారు శబ్దం విని సుబ్బయ్యగారు బయటికి వచ్చారు. "వచ్చావా బాబూ! నాకు తెలుసు నువ్వు వస్తావని. రా బాబూ పాపను చూద్దువుగాని. వెంకన్నా సామాన్లు కారులోనుండి దించరా!" అంటూ ముందుకు గబగబా నడిచారు. మధు నెమ్మదిగా ఆయన వెనకనే నడిచాడు.

పాప పడుకుని వుంది. మధు నుదురుమీద చెయ్యివేశాడు. ఒళ్ళు కాలిపోతుంది.

"పాపా!" నెమ్మదిగా సుబ్బయ్యగారు పిల్చారు. "చూడమ్మా మధు బాబాయి వచ్చాడు."


"పాపా!" నెమ్మదిగా పిలిచాడు. నెమ్మదిగా పాప కన్నులు తెరచుకున్నాయి. మధు ఆ కళ్ళ కిరణాలలో పడ్డాడు. పాప కళ్ళు కాంతితో ఆనందంతో మెరిశాయి. మధు చేతితో పాప చెంపను తాకాడు. పాప తలను ఆ చేతి మీదనే వాల్చింది. నెమ్మదిగా కళ్ళు మూసుకుంది. ఆ అరచేతిలో స్వర్గంలో ఆత్మీయత పాపకు కనిపించింది.

కొంచెంసేపు ఉన్న తరువాత మధు నెమ్మదిగా బయటికి వచ్చాడు. సుబ్బయ్యగారు అనుసరించారు. "సుబ్బయ్యగారు, నేను మరో పదిరోజులు ఇక్కడే ఉంటాను" అన్నాడు మధు నెమ్మదిగా నిట్టూర్పు విడుస్తూ.

"అంతకంటేనా! బాబూ!" అంటూ సుబ్బయ్యగారు ఆనంద బాష్పాలు రాల్చారు.

* * *

పదిహేనురోజుల తరువాత పాప మళ్ళీ మామూలు



పండిత
డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాను-17

దాంపత్య సంసార సుఖ మనుభవించ లేకుండుట
శుక్లనష్టము, అత్యుష్ణము, ధాతుదౌర్బల్యము
నరముల బలహీనత, శరీర కృశత్వము,
మహాపంచశర కల్పం
హరించి వీర్యవృద్ధి కలిగించు రసాయనం.
సీసా రు10/-పోస్టు ఖర్చులు రు1-50అదనం
మదనతిల్ల (పై మర్దనకు)
అంగ నరముల బలహీనతకు సీసా రు. 10/-
చరకాశ్రమం ఫార్మసీ (ఫోన్ 2240)
24, తాలూకాఫీసు ఎదుట, విజయవాడ-3.


పెప్స్
లోక ప్రసిద్ధయిన
గొంతు
మరియు
గుండె
బిళ్లలతో
రొమ్ము పడిశెము
త్వరితంగా నివారించ బడినది
గొంతు నొప్పి, రొమ్ము పడిశెము దగ్గులు, జలుబులు, గొంతు మరియు గుండె బిళ్లలైన పెప్సుతో త్వరితంగా నివారణ యగును. పెప్సను చప్పరించి, నొప్పిని నివారించి క్రిములను నిర్మూలించే చర్యను జరుపునట్టి... అందరికమనకర ఆవిరులను ఆస్వాదించండి.

పెప్స్
గొంతు మరియు
గుండె బిళ్లలు
మందుల వ్యాపారు
లందరి వద్దనూ
దొరకును
ఏ. ఇ. ఫుల్‌ఫోర్డ్ (ఇండియా) ప్రైవేట్ లి.
FPY-56-TEL
మద్రాసు స్టేటుకు సోల్ డిస్ట్రిబ్యూటర్లు :
మెస్సర్స్. మోతి & కం, మద్రాసు-1.

# చివరి మలుపు

"పాపా!" అంటూ తలనిమురుతూంటే మధు కళ్లలో నీళ్లు తిరిగాయి.

"ఇన్ని రోజులకు నేను————" అంటూ మాటను మధ్యలోనే ఆపేసి పక్క నిలబడ్డ లలితను ప్రశ్నార్థకంగా చూచింది.

"మీ పిన్ని పాపా!" అంటూ చిరునవ్వుతో పాప చూపుకు జవాబు చెప్పాడు.

"అదన్న మాట సంగతి" అంటూ లలితవైపు చూచి "నమస్కారం పిన్నీ" అంది చేతులు జోడిస్తూ. లలిత పాపచేతిని చిరునవ్వుతో తను చేతిలోకి తీసుకుని మధు వైపు చూచింది.

"రాబాబాయి! రా పిన్నీ!" అంటూ లలిత చేయిపట్టుకుని దారితీసింది.

"ఎప్పటికీ పాప నాపాపే" అంటూ మధు వారిని అనుసరించాడు. మధు అన్న మాటలను వెనక్కు తిరిగి చూసి నిండుగా నవ్వింది గౌరి. "మీరు అదృష్టవంతులండీ !" అంది లలిత మధుతో విడిదివారింట్లో. పెళ్లిలో పాపవల్ల మధు వహించిన ప్రాముఖ్యాన్ని చూచి లలిత ఆ మాట అంది. మధు చిరునవ్వుతో లలిత మొహంలోకి చూచాడు. ఆ నవ్వులో ఆత్మ సంతృప్తి, ఆత్మీయత, వీడని మమకారం లలితకు కనిపించాయి.

"చూడు లలితా !" మధు కంఠం గంభీరంగా వినపడింది లలితకు.

"నేను జీవితంలో పొందిన మధురానుభూతు లలోకల్లా పాప పరిచయం మహత్తరమైనది. దైవం నిర్ణయించిన మార్గంలో ప్రయాణించేటప్పుడు, ఎన్నో మహత్తర విషయాలను తెలుసుకొంటాం. కొంతమందితో ఆత్మీయత ఏర్పడుతుంది. మరికొంతమందితో బద్ధ వైరం ఏర్పడుతుంది. అవి రెండూ మహత్తర మైనవే. ఆత్మీయతను కానీ, వైరాన్ని కానీ మనం జీవితాంతం మరచిపోలేము. నాకు పాపతో ఏర్పడిన ఆత్మీయత కూడా అలాంటిదే. ఈ జీవితబాట అంతం ఎప్పుడు ? ఇది ఎలాగు ముగుస్తుంది ? ఎప్పుడు ముగుస్తుంది ? అనే ప్రశ్నలు మానవుణ్ణి నిత్యం వేధిస్తూనే ఉన్నాయి. వర్తమానంలో ఉన్న మానవుడు భవిష్యత్తులో ఉన్న ఈ ప్రశ్నలను గురించి ఆలోచించవలసిన అగత్య మేమిటో. వర్తమానాన్ని సుఖతరం చేసుకొనటం వరకే మానవుని ధ్యేయమైతే ఇన్నికష్టా లనుభవించవలసిన అవసరం లేకపోవచ్చును. భవిష్యత్తు, వర్తమానంగా మారుతున్నప్పుడు మనలోని ఆతృత వర్ణనాతీతం. మనం వూహించినది నిజ మవచ్చును. లేదా అబద్ధ మవవచ్చును. అలాగే నేనూ పాప భవిష్యత్తును ఉజ్వలంగా వూహించాను. నేను వూహించినది నిజమైతే నా జీవిత మధురానుభూతి శాశ్వతమైనంత. మరి నేను వూహించినది భవిష్యత్తులో వక్రిస్తే ...." మరి మధు మాట్లాడలేకపోయాడు. కంఠం రుద్ధమైంది.

"వూరుకోండి. అనవసరమైన వాటిని వూహించుకుని బాధపడడం ఎందుకు. తను ప్రేమించిన వ్యక్తిని పెళ్లిచేసుకున్న పాప భవిష్యత్తు ఉజ్వలం కాక మరేం అవుతుంది."

మధు మరి మాట్లాడలేదు. నిశ్శబ్దంగా నిద్రపోవడానికి ప్రయత్నించడం మొదలుపెట్టాడు బయటి భాజాభజంత్రీల గొడవ చాలా ఎక్కువగా ఉంది.

కాలపురుషుడు రెండు సంవత్సరాలని వెనక్కు నెట్టి ముందుకు సాగిపోయాడు. ఈమధ్య కాలంలో మధుకు పాపదగ్గరనుండి రెండు మూడు ఉత్తరాలు వచ్చాయి. వాటిలో మధుకేమీ ప్రత్యేకత ఏమీ కన్పించలేదు. ఈ రెండు మూడు ఉత్తరాలు పాప భర్త పనిచేస్తున్న చోటునుంచి వచ్చినవే. కాని చివరి ఉత్తరం మాత్రం "నందిచెరువు" నుంచి. పాప వ్రాసింది సుబ్బయ్యగారికి తీవ్రంగా ఉందని. వెంటనే రమ్మని.

మధు ఒక్కడే బయలుదేరి వెళ్ళాడు. మధుని చూడగానే పాప కండ్లనుండి కన్నీరు కాల్వలు కట్టింది. "పాపా!" అని హృదయానికి హత్తుకన్నాడు. "ఏందమ్మా !" అంటూ ఇంట్లో నడిచాడు. సుబ్బయ్య మంచం చుట్టూ ఒకరిద్దరు నిలబడియున్నారు. ఎవరో ఒకావిడ నెత్తిమీద అయిస్ సంచి పెట్టుతున్నది. వంటిమీద స్పృహ లేకుండా సుబ్బయ్యగారు పడుకుని ఉన్నారు. ముఖంలోని గాంభీర్యం మాత్రం ఏమాత్రం తొణక లేదు. కొంచెం సేపటికి డాక్టరు వచ్చారు. మధును చూడగానే పలకరించాడు. పరీక్షించడం అయిపోయిం తరువాత మధును పక్కకు పిలిచాడు." "సారీ నాశక్తికొద్దీ ప్రయత్నించాను. ఇది బ్రెయిన్ ఫీవర్. దాని సంగతి మీకు నేను వేరే చెప్పనక్కరలేదు." అన్నాడు. డాక్టర్ వెళ్లిపోయిన తరువాత మధు సుబ్బయ్యగారి మంచం దగ్గరకెళ్ళాడు. పాప తండ్రికాళ్ల మీద పడి ఏడుస్తున్నది. నెమ్మదిగా బయటకెళ్ళాడు. రాత్రికి అందరూ వెళ్ళిపోయారు. మధు అక్కడే ఈజీ చైర్‌లో పడుకున్నాడు. తెల్లవారు జామున ఎందుకో మెలకువ వచ్చి లేచి చూచాడు. పాప అలాగే మంచంమీద తల క్రింద పెట్టి పడుకుని ఉంది. మధుకు అనుమానమేసింది. లేచి వెళ్లి "పల్స్" చూచాడు. చెయ్యి చల్లగా తగిలింది. మధు లేచి నిలబడ్డాడు. అప్రయత్నంగా మధు కళ్ల నుండి రెండు కన్నీటి చుక్కలు రాలిపడ్డాయి. పాప నిద్రపోతున్నాకూడా కన్నీటిచారలు ఇంకా కన్పిస్తున్నాయి. ఒక రోజున పాప తనతో అతి చనువుగా ఉండటం చూచి సుబ్బయ్యగారు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. "బాబూ గౌరిని అందరూ దాని ఆస్తిని చూచి ప్రేమించేవారే తప్ప, దాని హృదయాన్ని ప్రేమించేవారు కనపడలేదు నా బంధువుల్లో. అందుకే గౌరికి మీరంటే అంత ఆత్మీయత".

నెమ్మదిగా మధు తేరుకుని పాపను లేపాడు. తండ్రి శరీరం చల్లగా తగలటం చూచి పాప ఒక్కక్షణం స్తంభించి పోయింది. నెమ్మదిగా పాపను బయటికి తీసుకువెళ్ళాడు. బయటకు వెళ్ళిన తరువాత పాప పూర్వపు స్థితికి వచ్చింది. భోరున మధు హృదయంలో తలదాచుకుని ఏడ్చింది. జరుగవలసిన విధులన్నీ తెల్లవారి జరిగాయి.

పాప పెండ్లినాటికి ఇప్పటికి చాలా మారిందనిపించింది మధుకు. బాగా చిక్కిపోయింది. కళ్ళు గుంటలు పడ్డాయి. నల్లటి చారలు కళ్ల క్రింద

విచ్చిపోయాయి. మొహం పాలిపోయింది. సుబ్బయ్య గారు మరణించినదానికే పాప ఇలా తయారైందంటే మధు నమ్మలేకపోయాడు., మనస్సులోని ప్రశ్ననే బయటపెట్టాడు. పాప చిరునవ్వు నవ్వడం తప్పఏమీ మాట్లాడలేదు. ఆ చిరునవ్వులో విషాదం తాండవించింది.

సుబ్బయ్యగారు చనిపోయిన తరువాత గౌరి భర్త శేఖర్ లీవుమీద వచ్చాడు. శేఖర్ పాపలాగ మౌనమూర్తి కాదు. చాలా కలుపుగోలు మనిషి. నిష్కల్మష హృదయుడు. పాపను గురించి చాలా ప్రేమగా మాట్లాడాడు. మరి పాప క్షీణించడానికి కారణమేమిటో మధుకు బోధపడలేదు.

సుబ్బయ్యగారు తన యావదాస్తిని గౌరి పేర సర్వహక్కులతో వ్రాశాడు. మరి రెండు రోజులుండి మధు బయలుదేరాడు. బయలుదేరే టప్పుడు గౌరికి ధైర్యం చెప్పాడు.

మధ్యకాలంలో పాప దగ్గరినుండి ఒకటి రెండు ఉత్తరాలు వచ్చాయి. తను గర్భంతో ఉన్నట్టు ఒకదాంట్లో వ్రాసింది. మధు ఆ ఉత్తరాన్ని లలితకు చూపించాడు. లలిత పోదామంది. కానీ మధు ఇష్టపడలేదు. ఒకటేసారి ప్రసవించిన తరువాత పోయి చూస్తే బాగుంటుంటుందన్నాడు.

ఒక రోజు మధుకు శేఖర్ వ్రాసిన ఉత్తరం వచ్చింది. గౌరికి మధును చూడాలని ఉందని అంటుందని రమ్మని ప్రార్థిస్తూ వ్రాశాడు. ఉత్తరం అందిన రెండు రోజులకు మధు, లలితతో సహా బయలుదేరాడు. పాప ఎదురొచ్చింది. చాలా బలహీనంగా ఉంది. నడవడానికికూడా శక్తి లేనట్టు కన్పిస్తూ ఉంది. బలహీనత పాపను కృంగదీసింది. మధును లలితను చూడడంతో సంతోషంగా ఆహ్వానించింది. పాప ముఖంలో మాతృత్వ కళ ప్రకాశిస్తుంది. ఒకప్పుడు తనతో చిన్న ఫ్రాకు వేసికుని తిరిగిన పాప మధుకు గుర్తుకు వచ్చింది. తను పాపను బాల్యదశలో, యవ్వనదశలో చూచాడు. వీటి రెండిటికన్నా ఉత్తమమైన మాతృత్వ దశలో తను పాపను చూడ బోతున్నాడు. మధుకు చెప్ప లేని ఆనందం కలిగింది.

అంత బలహీనంగా ఉన్న పాపను హాస్పిటల్లో ఎందుకు చేర్పించలేదని శేఖర్‌ను మందలించాడు. శేఖర్ మాట్లాడలేదు. అతని మొహంలో ఏదో అశక్తత గూడుకట్టు కున్నట్లు కన్పించింది. ఆ ఇంట్లో తనకు ఎవ్వరూ ఎదురవ్వలేదు. ఒక్క పని మనుషులు, పాప, శేఖర్ మినహా. మరి అత్తా, వదినె అన్నట్లు పాప వ్రాసిందే —అనుకున్నాడు మధు. కొన్ని జతల కళ్ళు తన్ను చూస్తున్నట్టు మధు గమనించాడు. కానీ పాపను హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళడంలో అవేమీ గమనించలేదు. శేఖర్ లీవుకు అప్లై చేశాడు. గౌరిని వదలి ఒక్క క్షణం ఉండడం లేదు. పాప మధుతో ఏదో చెప్పాలని ప్రయత్నించింది. కానీ శేఖర్ ఉండడంవలనో, లేక మరో కారణంవలనో ఏం మాట్లాడలేదు.

* * *

హాస్పిటల్‌కు వచ్చిన మరునాటి రోజు గౌరికి నొప్పులు ప్రారంభమయ్యాయి. పాప బాధ వర్ణనాతీతంగా ఉంది. మధు తనకు తెలిసిన డాక్టరు మిత్రులతో సంప్రదించాడు. శేఖర్ కళ్ళలో నీళ్ళు తిరగడం, అతనేదో తెలియని బాధపడడం మధు గమనించాడు.

గౌరిని లోపలికి తీసుకెళ్ళారు. మధు, శేఖర్, లలిత బయట కూర్చున్నారు. ఎవ్వరూ మాట్లాడలేదు. అందరి హృదయాల్లోనూ విషాదం, ఆత్రుత గూడుకట్టుకున్నాయి. కొంచెంసేపటికి నర్సు బయటికి వచ్చింది. "ఆపరేషన్ కేస్ ప్లీన్" అని చెప్పి ఎలా వచ్చిందో అలా మాయమైంది. సాయంత్రానికి గౌరి ప్రసవించింది. తల్లి, పిల్ల క్షేమంగా ఉన్నారని తెలిసింది. మధు, శేఖర్ లోపలికెళ్ళారు. బిడ్డను చూసి, "పాపకు ప్రతిబింబం అనుకున్నాడు మధు. శేఖర్ ఆనందం వర్ణనాతీతం. గౌరి మధు మొహంలోకి చూసింది. ఆ చూపులో మధుకు, ఎన్నో ఆనంద భావాలు కన్పించాయి. తరువాత బిడ్డను ముద్దుపెట్టుకుంటున్న శేఖర్ వైపు చూచి మనస్సు తృప్తిగా చిరునవ్వు నవ్వింది. మధుతో ఏదో చెప్పాలని ప్రయత్నించింది.

"తరువాత మాట్లాడదాంలే పాపా!" అని గౌరిని వారించాడు.

---

భర్త : రాధా! నిన్ను ఈ ప్రపంచంలో అన్నింటికంటే ఎక్కువగా ప్రేమిస్తున్నాను. నీ కోసం దేనైనా తృణ ప్రాయంగా త్యజించటానికి సిద్ధంగా ఉన్నాను.

భార్య : అలాగైతే ఈ నెల జీతంతో నాకు ఒక నెక్లెస్ కొని పెట్టండి. అది చాలు ప్రస్తుతానికి.

రాజారావు (తెనాలి)

---

ఆ రాత్రికి లలిత గౌరి దగ్గర పడుకోవటానికి, మధు, శేఖర్ ఇంటికిపోయి పడుకోవటానికి నిశ్చయించుకున్నారు.

* * *

నడిరాత్రిలో శేఖర్ గబ గబా మధును తట్టి లేపాడు. మనిషి ఆపాదమస్తకం ఒణికిపోతున్నాడు. "ఏం జరిగింది శేఖర్" అన్నాడు మధు కంగారుగా. "గౌరికి ఫిట్సు— — — — — ఫోను వచ్చింది" శేఖర్ మాటలు తడబడ్డాయి.

మధు కారు షెడ్డువైపు నైట్‌డ్రెస్‌తోనే పరిగెత్తాడు. శేఖర్ మధును అనుసరించాడు. తడబడే అడుగులతో.

గౌరిచుట్టూ ఇద్దరు డాక్టర్లు, నర్సులు ఉన్నారు. లలిత కంగారుగా కాళ్ళవైపు నిలబడి చూస్తూ ఉంది. బిడ్డను వేరేచోట పడుకోబెట్టారు.

మధు, శేఖర్ వచ్చేటప్పటికి గౌరి కళ్ళు తేలిపోయి ఉన్నాయి. కాళ్ళుచేతులు బిగుసుకుపోయాయి.

ఆ రాత్రంతా మధు, డాక్టర్లు ఎన్నో విధాల ఫిట్స్ తగ్గించాలని ప్రయత్నిస్తూనే ఉన్నారు. తెల్లవారు జామున ఫిట్స్ నెమ్మదిగా తగ్గాయి. కళ్ళలోని కాంతి తగ్గిపోతూ గాజుకళ్ళ ఆకృతిని ఏర్పరుచుకుంటున్నాయి. కాళ్ళచేతుల బిగువు తగ్గింది. అంటే అర్థమేమిటో మధుకు వెంటనే బోధపడింది.

అతని హృదయంలో బడబాగ్ని ప్రజ్వరిల్లింది. తనతో కారులో తిరిగిన పాప, మారాంచేసి తన పక్కన నిద్రపోయిన పాప, జ్ఞానిలా తన్ను వింత ప్రశ్నలతో వేధించిన పాప, ఈ నాడు నిస్సహాయంగా ఎవ్వరు తోడులేకుండా అనంత దూర ప్రయాణానికి, తన అంతిమ యాత్రకు బయలుదేరింది. మధు నెమ్మదిగా బయటికి వచ్చాడు. టేబులో మీద తలపెట్టి పడుకున్నాడు. హృదయంలోని బడబాగ్ని వేడికన్నీరుగా ప్రవహించటం మొదలు పెట్టింది.

లోపల శేఖర్ ఏడుస్తున్న గొంతు వినపడింది. నెమ్మదిగా లలిత బయటికి వచ్చింది. మధు లలిత బయటికి వచ్చింది. మధు తలమీద చెయ్యి వేసి "లేవండి పోదాం" అంది.

"పాప పోయింది లలితా, నిర్దాక్షిణ్యంగా నన్నొదలి పోయింది" అన్నాడు పూడుకుపోయినగొంతుతో.

"పాప జీవితంలో ఒక నందనవనమని మీరేగా అనేవారు. అది మీ జీవితంలో ఒక వెలుగు రేఖ మాత్రమే. క్షణకాలం మీ హృదయాన్ని అవ్యాజ సరోవరంలో విహరింప జేసిన అమృత మూర్తి. లేవండి. పోదాం".

మధు లలిత ముఖంలోకి చూచాడు. హృదయం అనంతమైన బాధ ప్రతిధ్వనిస్తున్నా ముఖంలో సంతోషాన్ని కనబరచడానికి ప్రయత్నిస్తున్న స్త్రీ మూర్తి ధన్యురాలు అనుకున్నాడు. లలిత భుజాన్ని ఆధారంచేసుకుని నెమ్మదిగా బయటికి నడిచాడు. తనను బంధించిన మమకార బంధంలో నాటితో తెగిపోయింది. సుబ్బయ్యగారు వ్రాసినట్లు, దాన్ని వ్యక్తులుగానీ, సంఘం కానీ తెంపలేకపోయింది. కానీ దైవం దాన్ని సాధించగలదనే విషయాన్ని ఆయన విస్మరించాడు అనుకున్నాడు.

* * *

మధు ఒక వారం రోజులు సెలవు పెట్టాడు. మనశ్శాంతి కోసరమై ఒక వారం రోజులు ఎక్కడికైనా పోదామని నిశ్చయించు కున్నాడు. సరిగ్గా బయలుదేరే సమయానికి ఒక కవరు పోస్టులో వచ్చింది. చింపాడు. మొదట ఒక ఉత్తరం బయటికి వచ్చింది. దాన్లోని దస్తూరిని ఎక్కడో చూచినట్టు గుర్తు. కింద సంతకం చూచాడు శేఖరం. పాప భర్త.

* * * * * * * * *

ఫిబ్రవరి, 1961

మధుబాబూ!

గౌరి మరణంతో బాటుగా ఆమె పెట్టెలో మీకు వ్రాసిన ఉత్తరం చదివిన వెంటనే నా హృదయం దహించుకుపోయింది. మంచితనానికి విలువలేని ఈ కుటుంబాన్ని చూస్తుంటే నాకు అసహ్యం కలుగుతూ ఉంది. రాక్షసులు ఎక్కడో వికృత రూపాలలో ఉంటారని వింటుండేవాడిని. కానీ మానవరూపంలో ఉన్న రాక్షసులను నేను ప్రత్యక్షంగా చూస్తున్నా నిప్పుడు. జీవితంమీద నాకున్న గౌరవం, ఆసక్తి పోయాయి. జీవితం అంటే నిర్లక్ష్యం మాత్రమే మిగిలింది.

గౌరి ఉత్తరాన్ని చదివే ముందు నా జీవితాన్ని

గురించి కొంచెం తెలుసుకుంటే, నాలోని దౌర్బల్యాన్ని గుర్తిస్తారు. నా కన్న తల్లిదండ్రు లెవరో నాకు తెలియదు. ప్రస్తుతం ఉన్నవారు నన్ను పెంచినవారు మాత్రమే. నా కన్న తల్లి దండ్రుల వలన నాకు కొంత స్థిరాస్థి సంక్రమించింది. నా పెంపుడు తల్లితండ్రులకు ఒక కూతురు ఉండేది. ఆమె భర్త మిలిటరీలో చేరాడని డని వారంటారు. ఆమెకు ఒక కూతురుంది. ఆమెను నా కిచ్చి పెళ్లి చేయాలని చిన్నప్పటి నుంచి అంటుండేవారు. కానీ నాకే ఇష్టం ఉండేది కాదు. ఆమె నామీద అధికార మున్నట్లు ప్రవర్తించేది. అంతేకానీ నామీద నిజమైన ప్రేమ ఆదరణ కనబరిచేవారు కాదు. కానీ నాకు కావలసినది నామీద అధికారం చెలాయించే వారు కాదు, నామీద నిజమైన ప్రేమ ఆదరణ కనబరిచేవారు కావాలి. నన్ను ప్రేమించేవారు కావాలి. నా పెంపుడు తల్లితండ్రులు కూడా నేను వారి సొంత ఆస్తి అయినట్లు ప్రవర్తించే వారు. ఈ బంధనాల నుండి తప్పించుకోవాలంటే నన్ను ప్రేమించే స్త్రీని నేను వివాహం చేసుకోవాలి. చదువు పూర్తి అయ్యేవరకు వివాహ ప్రసక్తి లేదని పెళ్లి వాయిదా వేశాను. ఉద్యోగంలో చేరాను. పెళ్లి చేసుకోమని ఒత్తిడి చేశారు. ఎలానో తప్పించుకునేవాడిని. ఒకసారి ఏదో పనిమీద "నంది చెరువు" వెళ్లాను. అక్కడ గౌరితో పరిచయమైంది. ఇద్దరం పెళ్లి చేసుకోవాలనుకున్నాము. సుబ్బయ్యగారిని వెంటనే అడిగాను. గౌరికి ఎట్టి పరిస్థితిలోను అడ్డుచెప్పని సుబ్బయ్య గారు వెంటనే అంగీకరించారు.

ఈ విషయం మా తల్లిదండ్రులకు తెలిసింది. అగ్గిమీద గుగ్గిలం వేసినట్లు మండిపడ్డారు. ఆస్థిలో చిల్లిగవ్వ రాకుండా చేస్తామన్నారు. ఈ పరిస్థితులను ఎదుర్కోవటానికి నేను ఎప్పుడో సిద్ధంగా ఉన్నాను. నాకు ఆస్తి అక్కరలేదన్నాను. పరిస్థితులు విషమించాయని మా పెళ్లికి అంగీకరించారు.

గౌరి కాపరానికి వచ్చిన తరువాత ఎన్నో బాధలు పెట్టేవారు. కానీ నా మనసు కష్టపడు తుందని గౌరి నాతో చెప్పేదికాదు. చూచాయగా గమనించిన నేను వారిని మందలించబోతే గౌరి నన్నడ్డగించేది. వార్ధక్యంలో ఉన్నవారిని బాధ పెట్టడం సమంజసం కాదనేది. ఇవి భరించలేక నేను ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాను. కానీ, తల్లి, అక్క అనే భూతాలు వెంబడించాయి. వారి ఆశయాలు రెండు. మొదటిది గౌరిని తరిమి వేయడం, రెండవది మా అక్క కూతురుతో నా పెళ్లి చేయడం. మొదటిది గౌరి మరణం వలన నెగ్గించుకున్నారు. కానీ రెండవది నెగ్గడం అసాధ్యం.

నేను మనశ్శాంతి కోసరమై వెళ్లిపోతున్నాను. ఎక్కడికో నాకే తెలియదు. నా గమ్యం ఏమిటో తెలియదు. నేను పుట్టగానే నన్ను అనాధను చేసి నా తల్లిదండ్రులు వెళ్లిపోయారు. ఇప్పుడు కూడా నేను అనాధగానే వెళ్లిపోతున్నాను. ఆత్మహత్య చేసుకోలేని దౌర్బల్యహృదయం నాది. నాలాగే నా బిడ్డను కూడా అనాధను చేసి నేను వెళ్లిపోతే నా గౌరి ఆత్మకు శాంతి లేదు. అందుకే చివరకు ఆలోచించి ఈ నిర్ణయానికి వచ్చాను. నా బిడ్డకు మీరు ఆశ్రయ మివ్వగలరనే ధైర్యాన్ని నా గౌరి నాకు ప్రసాదించింది.

మీరు వచ్చేటప్పటికి నేను నా హృదయానికి శాంతి అన్వేషణలో ఉంటాను. గౌరి ఆస్తి అంతా పాపకు చెందేటట్లు వ్రాశాను. దానికి సంబంధించిన పత్రాలు మీకు పోస్టులో వస్తాయి. మా తల్లిదండ్రులు మిమ్మలను అడ్డగించ రనుకుంటాను. వారికి కావలసిన నా ఆస్థిని వారికి వచ్చేటట్లు వ్రాశాను. అది పాపిష్టి ఆస్థి. అది నా బిడ్డకు వద్దు. ఒకవేళ వారు మిమ్మలను అడ్డగించితే వారిని ఆదారినుండి తొలగించే మార్గం మీకు తెలుసు.

ఇట్లు,
శేఖరం.'

మధు నిట్టూర్పు విడిచి రెండవ ఉత్తరం విప్పాడు. తనకు బాగా పరిచయమున్న సీత దస్తూరి.

• • • • • •

డిసెంబర్, 1962.

మధు బాబాయి!

జీవితంలో ఒక్కొక్కసారి మనం నిర్మించుకున్న వూహాసౌధాలు బలవంతంగా కూల్చివేయబడతాయి. వాటిని నిలపడం వ్యర్ధమని మనకు తెలుసు. కానీ మనం ప్రయత్నిస్తూనే ఉంటాము. అది మానవుని ఆశాజీవితంలో ఒక మెట్టు.

ప్రేమించి చేసుకున్న పెళ్లి నా జీవితంలో జ్యోతులను వెలిగిస్తుందని ఆశించాను. అలాగే ఆ జ్యోతులను వూహించుకుంటూ ప్రయాణంచేశాను.

శేఖర్ పెళ్లి నాతో జరగడానికి వారి తల్లిదండ్రులకు ఇష్టంలేదని, నాకు తరువాత తెలిసింది. ముందుగానే తెలిసినా నేను వారినే పెళ్లిచేసుకుని ఉందును. జీవిత ప్రవాహానికి భయపడి విధి నిర్ణయించిన గమ్యాన్నిచేరి సంతృప్తిపడేకంటే, గమ్యాన్ని ముందుగానే నిర్ణయించుకొని జీవిత ప్రవాహానికి ఎదురీదటం, ఉత్తమమని, నువ్వు చెప్పిన మాటలు నేను జీవితంలో మరచిపోలేను బాబాయి. కష్టాలకు భయపడి ప్రేమించిన వ్యక్తిని దూరం చేసుకోవటం మూర్ఖత్వం కాదంటావా బాబాయి?

అత్త, వదినె నన్ను కష్టపెట్టారనేకంటే, హింసించారని చెప్పడం సబబుగా ఉంటుందేమో. అయినా నేను నా భర్తకోసం అవన్నీ భరించాను. నాభర్త చూపించే ప్రేమలో అవన్నీ మరచిపోగలిగాను. చిన్నప్పటి నుండి శాంతికి దూరమై వ్యధతో పెరిగిన నాభర్తకు ఇప్పుడుకూడా ఇవన్నీ చెప్పి వారికి శాంతిని దూరం చేయడం ఇష్టంలేక వాటిని మరుగుపరిచాను.

ఒకసారి మా అత్త నాకు మరెవరికో సంబంధమున్నట్లు వారితో చెప్పబోతే ఆయన ఏమన్నారో తెలుసా బాబాయి. "అమ్మా! నా జీవితంలో మనస్ఫూర్తిగా ఎవరినైనా నమ్ముతానంటే అది ఒక్క గౌరిని మాత్రమే. గౌరి మీద నాకు సంపూర్ణ విశ్వాసముంది. నాకుతప్ప మరెవ్వరికీ గౌరి హృదయంలో చోటులేదు. నా గౌరి దేవత. నిష్కల్మషమైన హృదయం గల దానిమీద లేని అభాండాలను వేసి ముసలితనంలోకూడా పాపాన్ని మూటగట్టుకోకు."

అలాంటి వారికి ఈ చిన్న విషయాలన్ని చెప్పి బాధపెట్టడం భావ్యమంటావా బాబాయి. నామీద వారికి విరక్తికల్గించలేమని గమనించి, వారి ఎదురుగా నన్ను ఎంతో ప్రేమతో చూస్తున్నట్లు నటించడం, వారు లేనప్పుడు సూటిపోటి మాటలని బాధపెట్టటం మొదలుపెట్టారు. ఆ విషయాలన్ని మీకుజెప్పి బాధపెట్టడం ఇష్టంలేకనే, మీరడిగినా, మౌనం వహించాను. నాన్న మరణించినా, నాన్నను మించిన మధు బాబాయి ఉన్నాడనే ధైర్యంతో ఉన్నాను.

నేను గర్భంతో ఉన్నానని తెలియగానే, ఇంట్లో కలవరం బయలుదేరింది. నాభర్త ఆనందసాగరంలో తేలిపోయారు. వేరే కాపురం పెడతానన్నారు. కానీ చిన్నప్పటినుంచి పెంచినవారిని వార్ధక్యంలో నిరాధారంగా వదలడం ధర్మమనిపించ లేదు. ఆ మాటే వారితో అన్నాను. ఒక రోజు మా వదినె



" తమరి త్రాపుచెయ్యాలంటె ఇరవైరూపాయలవుతుంది సార్!... చేయమంటారా?"

ఎక్కడలేని ఆప్యాయత కనబరుస్తూ పాలు తెచ్చి యిచ్చింది. గర్భిణి స్త్రీలు బలంగా ఉండాలన్నది. సందేహంలేకుండా తాగాను. రెండు మూడూ రోజుల తరువాత నా గర్భంలో విపరీతమైన బాధ బయులుదేరింది. ఒక రోజు వాళ్ళు రహస్యంగా మాట్లాడుకొంటూంటే విన్నాను. నా గర్భస్రావానికి ఏదో నాటు మందు ఇచ్చారని. అత్తా వదినె గర్భస్రావానికి మందిచ్చారని వారితో ఎలా చెప్పేది బాబాయి? ఒకవేళ తెగించి చెప్పినా కలిగే పరిణామ మేమిటో నాకు తెలుసు. అందుకే మీకే ఉత్తరం వ్రాయడం. డాక్టర్లు తగ్గిస్తారనుకున్నాను. కానీ బాధ అంతకంతకూ ఎక్కువ అవుతుంది ఉందే కాని తగ్గడం లేదు.

ఈ ఉత్తరాన్ని ఎలా పోస్టు చేయడం ? వారికిస్తే అసలు విషయం బయట పడుతుందేమో ? ఇంట్లో పని వారి కిస్తే అత్తగారికి చేరుతుంది. నేను ఎక్కువ దూరం నడిచే స్థితిలో లేను. అయినా ఈ ఉత్తరం నా మధు బాబాయికి చేరుతుంది. మరి ఇది చేరగానే వస్తావుగదా బాబాయి !

ఇట్లు, ప్రేమతో,
మీ పాప.'

"ఏమిటండీ అది ?" అంది మధు లలిత మధు కళ్లనుండి జారిపడుతున్న కన్నీటిని చూచి.

"పాపం చివరి ఉత్తరం" అన్నాడు మధు లేచి నిలబడుతూ.

లలిత ఉత్తరాన్ని తీసికొని చదివింది.

"మానవరూప రాక్షసులు" అంది అప్రయత్నంగా లలిత.

"పాప ఏ విషయాన్నీ ఇతరులతో చెప్పే స్వభావం కలది కాదు లలితా! ఎన్ని బాధలనైనా తన హృదయంలో ఇముడ్చుకునేది. తనవల్ల ఇతరులు బాధపడటం ఇష్టంలేదనేది. ఆ స్వభావమే పాపను ఈ లోకంలో తన పాత్రను విరమించేటట్లు చేసింది."

మధు నెమ్మదిగా బయటికి నడిచాడు ఉత్తరాన్ని లలిత చేతినుండి తీసి జేబులో పెట్టుకుంటూ.

"ఎక్కడికండీ ?" అంది లలిత ఆతృతగా.

కారు తలుపు తీసి డ్రైవింగ్ సీటులో కూర్చుంటూ "నా పాప ప్రతిబింబం అయిన పాప బిడ్డను తీసుకురావడానికి లలితా ! శేఖర్ అసమర్థుడై తన గౌరిని పోగొట్టుకున్నాడు. నాకు తెలియక పాపను పోగొట్టుకున్నాను. తన బిడ్డలో తన గౌరిని చూడలేక శేఖర్, అనంతవిశ్వంలోకి వెళ్లిపోయాడు. కానీ నేను నా పాపను, పాప ప్రతిబింబంలో చూచి తృప్తిపడగలను లలితా ! ఇది నా జీవితానికి, పాప జీవితానికి కూడా చివరి మలుపు." అని కారు స్టార్టు చేశాడు.

"ఒక్క క్షణం ఆగండి" అంటూ లలిత వచ్చి మధు పక్కన కూర్చొని "పదండి" అన్నది దృఢనిశ్చయంతో.

లలిత మొహంలోకి ఒక్క క్షణం చూసి మధు క్లచ్ వదలిపెట్టాడు.

దృఢనిశ్చయంతో ముందుకు సాగిపోతున్న ఆ కారును చూచి గౌరి ఆత్మ ఆనందంతో నిట్టూర్చింది. ★

పొదుపులోనే భద్రత వుంది
మీదీ, మీ దేశానిదీ కూడా !

